


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### సమాజానికి అద్దం

1970 నుండీ 1980ల దాకా సినిమాలు తీసుకుంటే ఎంతసేపూ కుటుంబ చిత్రాలే వుండేవి. అస్సలు ప్రపంచంలో ఏ సమస్యా లేనట్టు, ‘అత్తా ఒకింటి కోడలే‘, ‘తోడికోడళ్ళు‘, ‘అన్నదమ్ముల అనుబంధం‘, ‘చెల్లెలికాపురం‘, ‘కోడలు దిద్దిన కాపురం‘, ‘తల్లా పెళ్ళామా‘.. ఇలా.

నీ జగత్తు అంతా నీ కుటుంబమే అని ఆ కుటుంబంలో అనుబంధాలు చూపిస్తూ రెండు రీళ్ళు, కొట్టుకు చచ్చిపోడాలు చూపిస్తూ పదిహేడూ రీళ్ళు ఇదే ఫార్ములా. ఓ అన్నా వదినలు సీతా రాముళ్ళలా, లక్ష్మణుడికి పెళ్ళయితే ఊర్మిళ వచ్చి నిద్రపోవాలి కానీ, ఇంట్లో కలతలు పెట్టడం ఏవిటి చెప్పండీ?

"మీ వదిన నాకు సెకండ్ డికాషన్‌తో కాఫీ ఇస్తోంది. తను చిక్కని డికాషన్‌తో కాఫీ తాగుతోంది"

అంటే "ఊర్మిళా! మా వదిన దేవత. అలా అనకు."

"ఏం అంటే ఏం చేస్తావు?

"అంతే లక్ష్మణుడు చెయ్యి లేపుతాడు, అడ్డంగా నరికేస్తాను" అని అంటే,

"లక్ష్మణా ఊర్మిళ మీద దెబ్బ పడితే నేను చచ్చినంత ఒట్టు. నా మీద గౌరవం వుంటే వెంటనే ఇల్లు విడిచి ఊర్మిళతో రావణాసురుడి ఇంటికి వెళ్ళిపో" అంటుంది సీతమ్మ.

"వదినా.. అంతమాట అనకు"

"వెళ్ళాల్సిందే. అంతే"

"సరే వదినా వెళ్ళిపోతాను"

ఊర్మిళకి ఒళ్ళు మండిపోతుంది. "నేను ఇన్నిసార్లు అడిగాను, రాలేదు. మీ వదిన చెప్పగానే వచ్చేస్తావా?"

"అంతే ఊర్మిళా. అది నా వీక్ పాయింట్" లక్ష్మణుడూ, ఊర్మిళా వెళ్ళిపోతారు.

రాముడి ఉద్యోగం హఠాత్తుగా వూడిపోతుంది. సీతమ్మని లవుడూ, కుసుడూ "అమ్మా ఆకలే" అని పీక్కుతింటూ వుంటారు. సీతమ్మ ఒకరింట్లో ఫంక్షన్‌లో అంట్లు తోముతుంటుంది. అక్కడ తోడికోడలు ఊర్మిళ, ఒళ్ళంతా నగలతో, బొచ్చు

కుక్కపిల్లని ఎత్తుకుని వస్తుంది. షాల్ కూడా భుజాల మీదుగా కప్పుకుని, చేతులకి వైట్ గ్లౌజెస్ వేసుకుంటుంది. నోట్ ది కాస్ట్యూమ్స్. గర్వంగా, పొగరుగా వుండే గొప్పింటి అమ్మాయిల లక్షణాలూ, ఆహార్యం.

"ఓ.. మీ పనిమనిషా?" అంటుంది తోడికోడలిని చూసి, ఆ ఇంటి యజమానురాలితో. అలా ఎవరైనా ఎంత చెడ్డవాళ్ళైనా బయట లోకంలో మాట్లాడ్తారా?

సీతమ్మకి కంటనీరు తిరుగుతుంది.

"ఔను పనిమనిషే. మిగిలిన అన్నం తీసుకెళ్ళు ఆ అంట్ల గిన్నెల్లోవి" అంటుంది యజమానురాలు.

"ఒద్దు ఎంగిలి మెతుకులకి ఆశపడను" అంటుంది సీతమ్మ.

"కూటికి లేకపోయినా, పొగరుకి తక్కువలేదు" అంటుంది యజమానురాలు.

ఊర్మిళ విరగబడి నవ్వుతుంది.

లక్ష్మణుడు ఎయిర్‌పోర్ట్‌లో బయటకొచ్చి "కూలీ" అంటాడు. రాముడు పరిగెత్తుకెళ్ళి సూట్‌కేస్ అందుకుంటాడు. లక్ష్మణుడు అన్నని గుర్తుపడ్తాడు కానీ పక్కనున్న బాస్‌కి తెలిస్తే చులకన అవుతానని సైలెంట్‌గా అన్న పెట్టె మోస్తుంటే విలాసంగా వెనుక నడుస్తాడు. ఇనప దిమ్మెలు పెట్టినట్లు పెట్టె బరువుగా వుంటుంది. అన్న మొయ్యలేక కింద పడిపోతాడు.

"న్యూసెన్స్ ఫెలోస్" అంటాడు బాస్.

"ఔను" అంటాడు లక్ష్మణుడు.

ఇంకొక కూలీని పిలిచి పెట్టె పట్టించుకుని వెళ్ళిపోతూ వుంటే తమ్ముడు పదిరూపాయల నోటు అన్న మీదకి వేసి వెళ్ళిపోతాడు.

చిరుగుల చొక్కా, ఎర్రని చొక్కాకి తెల్లని పేస్తర్లు వేస్తాడు కాస్ట్యూమ్స్ డిజైనర్. ఇంటికి వచ్చి రాముడు, అన్నం అడుగుతున్న పిల్లల్ని కొడ్తున్న సీతకి పదిరూపాయల నోటు ఇస్తాడు "నీ మరిది ప్రయోజకుడు అయ్యాడు సీతా" అంటాడు.

సీత "అయ్యో ఎంత పని జరిగింది. ఊర్మిళ కూడా నేను అంట్లు తోముతుంటే చూసింది" అని కుళ్ళి కుళ్ళి ఏడుస్తుంది.

ఇక్కడ ఊర్మిళ తండ్రి రావణాసురుడూ, మేనత్త శూర్పణఖా, లక్ష్మణుడ్ని అవమానిస్తారు డైనింగ్ టేబుల్ దగ్గర భోంచేస్తుంటే. ఎవడో దారినపోయే దానయ్య, సూటూ, టై లతో వస్తే "నువ్వు లే కింద కూర్చో ఈ పెద్దాయన ఇక్కడ భోంచేస్తాడు" అంటారు.

లక్ష్మణుడు పెరట్లో కొచ్చి నూతి పళ్ళెం దగ్గర కూర్చుని తింటుంటే, కుక్క వచ్చి అన్నంలో మూతి పెడ్తుంది. వెంటనే శూర్పణక "టామీ నువ్వా అన్నం తినొద్దు. అది నిన్నటి అన్నం, నీ హెల్త్ పాడయిపోతుంది. అది అల్లుడి కోసం తీసి వుంచాను" అంటుంది.

ఇది విని ఊర్మిళకి కాస్త రోషం వచ్చి "శూర్పణకత్తా నా భర్తకి పాడయిపోయిన అన్నం పెడ్తావా?" అంటుంది.

"ఊరికే తింటూ కూర్చునే ఇల్లరికం అల్లుడికి అంతకన్నా మర్యాద కావాలా?" అంటుంది శూర్పణక.

తెల్లబోతుంది ఊర్మిళ.

ఈలోగా రాముడు ఒక కారు కింద కళ్ళు తిరిగి పడ్తాడు. వేళా పాళా లేకుండా తాగిపడిపోతున్నాడు. అనుకోకుండా ఆ కారు యజమాని "ఒరేయ్ రామూ, నేను రా ఆంజనేయుల్ని. రారా" అని తన కారు ఎక్కించుకుని,

కంపెనీకి తీసుకెళ్ళి "ఒకనాడు నువ్వు మీ ఆవిడకి మల్లెపూలు తీసుకురమ్మంటే, ఆ డబ్బులు నాకిచ్చి అప్లికేషన్ ఫార్మ్ తెప్పించి జాబ్ ఇప్పించావ్, ఇప్పుడు ఆ కంపెనీకి ఓనర్‌ని నేను. రా.. నువ్వూ పార్టనర్‌వి ఈ రోజునుండీ" అంటాడు.

అంతే బండ్లు ఓడలూ, ఓడలు బండ్లూ అయినట్లు, రాముా కోట్లకి పడగలెత్తుతాడు. మెర్సిడెస్ బెంజ్‌లో పిల్లల్ని స్కూల్ దగ్గర దింపుతుంటే, ఊర్మిళ అక్కడ పిల్లలికి బఠానీలు అమ్ముతూ చింకి చీరలో కనిపిస్తుంది.

"అమ్మా ఊర్మిళా ఏవిటమ్మా ఇదీ?" అంటాడు.

"నేను పాపాత్మురాలిని బావగారు. ఆ రోజు అక్కయ్య పలచని కాఫీ ఇచ్చిందని అబద్ధం చెప్పాను. అందుకే ఈ కష్టాలు పడ్తున్నాను" అంటుంది.

"అయ్యో లక్ష్మణ్ ఏడీ?" అంటాడు.

"ఆయన రిక్షా తొక్కుతున్నారు బావగారు" అని ఏడుస్తుంది.

"నా రక్తంతో తొక్కుతాను రిక్షానీ" అని లక్ష్మణుడు వస్తూ, ఖళ్ ఖళ్‌మని దగ్గుతూ ముందుకి తూలిపోతాడు. ఎర్రని పాన్ వుమ్ములా, జీరగా రక్తం"

"లక్ష్మణ్" అని రాముడు ఏడుస్తూ పట్టుకుంటాడు.

"పదండి ఇంటికి వెళ్దాం ఇప్పుడు నేనో కంపెనీ ఓనర్ని అంటాడు" రాముడు.

ఆ ఇంట్లో దీపావళి, సీతమ్మ ఒంటెడు నగలతో వుంటుంది. చిరుగుల చీరలో వచ్చిన ఊర్మిళ "అక్కయ్యా నా మొహం నీకు చూపించలేను" అని మొహం చెంగుతో దాచుకుంటుంది.

"అయ్యో నువ్వు నా చెల్లివి, ఓ తల్లి కడుపున పుట్టకపోయినా అక్క చెల్లెళ్ళం" అని సీతమ్మ దగ్గరకి తీసుకుంటుంది.

"కుటుంబం... అన్నగారి కుటుంబం" అని పాట పాడ్తారు అందరూ కలిసి.

"అయిపోయ్" అంత సింపుల్ సినిమా కథ.

అనుబంధాల గురించీ, కుటుంబంలో ఐకమత్యం గురించీ, చెరపకురా చెడేవులాంటి సినిమాలు వచ్చేవి. ఆ తర్వాత కాలక్రమేణా రెబెలియస్ సినిమాలు వచ్చాయి. ఆమెకథ, అంతులేని కథ, ఇది కథకాదు, ఆమె అంటూ స్త్రీ గురించి అనేక విలక్షణమైన కథలు వచ్చాయి.

అన్నింట్లోనూ ఒకటే కథ, స్త్రీ శక్తి స్వరూపిణి, ఆమెని ఇంట్లో వాళ్ళూ, వీధిలో వాళ్ళూ, అంతా నానా విధాలుగా మోసం చేస్తూంటే ఎదురు తిరుగుతుంది. ప్రతిఘటనగా గొడ్డలిపెట్టి నరికేస్తుందా? లేక జైలుకి పంపిస్తుందా? రేప్ చేసిన రౌడీ వెధవని 'నీకిదే శిక్షరా' అని పెళ్ళి చేసుకుంటుందా? ఇలాంటి సినిమాలొచ్చాయి.

1980, 1990, 2000, 2010 ఇలా దశాబ్దాలు గడుస్తున్న కొద్దీ సినిమాలు సమాజానికి అద్దం పడ్తూ, ఎన్నో మార్పులు సంతరించుకుంటూ 'ఏ' అనే సర్టిఫికెట్ కూడా సిగ్గుపడే 'అర్జున్ రెడ్డి'లూ, 'RX100'లూ కూడా. ఇలా మారిందర్రా యువత.

'అమ్మని తిట్టే ఓ తిట్టూ ఫ్యాషన్ అని చెప్పాయి. కానీ ఇది నవ్వొచ్చే విషయంకాకపోయినా నాకు బాగా నవ్వొస్తున్న విషయం ఏంటంటే, ఓ ఆడపిల్ల 'నో' అంటే ఆగిపోవాలిరా.. పశువులా మీద పడకూడదూ. పెళ్ళామేకదా అని 'థప్పడ్' కొట్టకూడదురా పదిమందిలో అన్న "పింక్", "థప్పడ్"లాంటి సినిమాలు 2020లో కూడా తియ్యాల్సిరావడం ఎంత సిగ్గుచేటూ. సినిమా సమాజానికి దర్పణం.

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4